కథ

# నేనూ... ప్రేమా... మనీషా!!

◆ అడబాల వి.వి.సత్యనారాయణ ◆

## మనీషా!
## క్షేమమా? క్షేమంగానే ఉండివుంటావ్.

ఉండాలనే కోరుకుంటున్నాను.

ఎందుకంటే నిన్ను నేను ప్రేమిస్తున్నాను గనుక...

ఈ ఉత్తరం అందిన రెండు మూడు రోజుల్లో నీ పెళ్ళి కదూ?

అవును 'పెళ్ళే' పెళ్ళయి పోయాక నువ్వు మరొకరిదానివి అయిపోయి వాళ్ళతో ఏడో ఏవి మిదో అడుగులు వడివేశాకా అప్పుడు "నిన్ను ప్రేమిస్తున్నాను" అని నేనంటే సభ్యసమాజం చెప్పు ముక్కు కొడుతుంది.

అంతేకాదు..., "వీడెవడో పిచ్చాడు" అనో "పోలీస్... పోలీస్" అనో నీ వ్యక్తిగత పరిధిలోకి నువ్ ముడుచుకుపోతావేమో కూడాను.

ఎందుకో తెలుసా?

అలా అనకపోతే నువ్వు మరొకరిదానివి అవలేవు గనక...

ఈ ఉత్తరం వ్రాయడానికి ఐదు నిమిషాలు ముందు 'హనుమాన్లు' ఏమన్నాడో తెల్సా? మరొకరైతే ఆత్మహత్య చేసుకునేంతమాట...

"ఎందరో నీ వెనుకపడి నువ్వు కావాలని వాళ్ళంతట వాళ్ళే నీ ఒళ్ళో వాలిపోవడానికి సిద్ధపడిన రోజుల్లో మనీషా నా మనీషా అంటూ ప్రేమ గీతాలు పాడావు. ఇప్పుడు చూడు నీ మనీషా నిన్ను ముక్కలు చేసి విసిరేసింది" ఇది ఆ మాట. ఆ మాట అంటూ వాడు ఏడిచాడు కూడా.

నాకు తెలిసి నా కోసం ఏడిచేవాడు ప్రస్తుతానికి వాడొక్కడే...

మనీషా! ఎప్పుడైనా గుర్తొస్తానా?

వస్తాను మనీషా... తప్పకుండా వస్తాను... ఎందుకో తెల్సా. 'మన జ్ఞాపకాల ప్రపంచం చెప్పు కోదగినంత చిన్నది' కాదు. దాని పరిధి దానికుంది.

బెంగుళూర్ లాల్‌బాగ్‌లో నువ్వు వేసిన జోకుకి నేను వ్రాసిన మూడు పేజీల భాష్యం అమ్మకు నోమకోక ముందు అగ్నికి ఆహుతి అయితే అవనీ...

అది నా హృదయ పుటల మీద పదిలం.

మైసూర్ 'బృందావన్ గార్డెన్'లో రంగురంగుల వింత కాంతుకలి మిలమిలలాడే నీటి తరంగాల మీద నీ నవ్వులు పూలపడవల్లా పయనించడం నాకు గుర్తే. మరి ఆ పూల పడవల్ని అంత నిర్దాక్షిణ్యంగా ఎలా కాల్చేసి మరీ మరొకరితో పెళ్ళికి ఒప్పుకున్నావ్ మనీషా??

అవును... "నీ పెళ్ళి నీ ఇష్టం" అంతేకదూ ... నేనే ప్రశ్నగా నేనే జవాబుగా నలిగిపోతున్న నన్ను చిన్ననే దేవీ, బేబీ, రాఘవా, ధనలక్ష్మీ, సూర్యకాంతం, సత్యవతీ, కలుసుకుని నన్ను విమర్శించి నాకు ధైర్యం చెప్పారు.

వాళ్ళకేం...

వాళ్ళకి పెళ్ళిళ్ళు అయిపోయాయి.

మొగుళ్ళతో కాపురాలు చేస్తూ పిల్లల్ని కంటూ 'లైఫ్'ని వాళ్ళకి నచ్చిన రీతిలో ఎంజాయ్ చేస్తున్నారు.

బహుశా వాళ్ళకి ప్రేమంటే తెలీదు.

ప్రేమించినవాడు... ప్రేమించి విఫలమైనా ఆ ప్రేమికురాలి మీద చిన్నమాట కూడా పడనీయడని వాళ్ళకేం తెలుసు.

నిన్ను వాళ్ళు ఎన్నో మాటలన్నారు. అంతకన్నా వాళ్ళకేం తెలీదు.

నాకేవేవో బోధించారు.

వాళ్ళలో కొందరు వాళ్ళ చెల్లెళ్ళ పేర్లు ఎత్తారు నా దగ్గర.

కొందరు వాళ్ళ ఫ్రెండ్స్ పేర్లు తలిచారు.

నేను మాత్రం నిన్నే తలుస్తున్నాను ఇప్పటికీ.

మనీషా! పెద్ద కోరిక అనుకోకపోతే 'పెళ్ళి'లోగా నీ ఇష్టం వచ్చిన క్షణంలో ఒక్కసారి కలుసు

◆◆◆ ఆ విషయం తెలిసిన అసలే పగిలిన నా గుండె మరింత అడ్రసు లేకుండా అయిపోతుంది. ◆◆◆


కోగలవా? కలుసుకో మనీషా! ఈ మధ్య నాకొక విపరీతమైన భయం పట్టుకుంది. నిన్ను చూడకుండా నేనెక్కడ చచ్చిపోతానో అని.

వద్దు మనీషా... కలుసుకోకు! మళ్ళీ ఈ విషయం నీక్కాబోయే భర్తకి తెలిసిందే అనుకో... అతను నిన్ను కాదనొచ్చు. ఆ విషయం తెలిసి అసలే పగిలిన నా గుండె మరింత అడ్రసులేకుండా అయిపోతుంది. నేనేమైపోయినా నువ్వు మాత్రం బాగా ఉండాలి మనీషా!

రాములవారి గుళ్ళో మనం చేసిన బొమ్మల పెళ్ళీ ఆ బొమ్మల్ని ఎత్తుకుని మనమూ మన బాలసైన్యమూ పోగుచేసిన బియ్యం, చిల్లర డబ్బులూ, ఆ సందర్భంగా మనం నమిలి మింగిన చాక్లెట్లూ... గుర్తుందా ఆ నాటి ముచ్చట... ఆలోచిస్తే మనీషా బొమ్మేనేమో మనీషా!

అవును బొమ్మేనేమో... అందుకే అప్పుడప్పుడూ విరిగిపోతుంటాడు.

ఇంతకీ ఎవరు విరిగిపోయింది?



నేనేగా నువ్వేమీ అనకు... నీ భర్తలో నువ్వు చాలా బాగా కలిసిపోయి నీ జీవితం పూలపాన్పుగా గడిపిపోయావన్ను ఏ ఆఖరి నిముషంలో గుర్తుచేసుకున్నా పట్టేదు.

తలంటుకున్న నీ కురుల్ని మునివేళ్ళతో తోసుకుంటూ నువ్వు పెన్సిల్ తో రాసిన కవితల్ని చూపించావ్ గుర్తుందా!

ఎవ్వరూ లేని ఆ సాయంత్రం మనం గాఢంగా చుంబించుకున్నప్పుడు అప్పటికప్పుడు నువ్వు రాసిన కవిత నాకన్నీళ్ళతో తడిసి చెరిగిపోతూ

**కథ**

# మనీషా డియర్! మనం మనిష్టంగా ప్రేమించుకున్నాం.

మళ్ళీ మళ్ళీ మొలుస్తోందది.

కవిత్వం రాస్తున్నావా?

జీవితం కవిత్వాన్ని డామినేట్ చేసినప్పుడు నువ్వు మాత్రం ఏంచేస్తావ్ లే! ఏం రాస్తావ్? రాస్తే రాయి లేకపోతే లేదు.

నువ్వు మాత్రం ఎవరికోసం రాస్తావు...

నా కోసం రాయగలవా ఇప్పుడు!

వద్దు... రాయకు... నీ కోసం... నీ భర్త కోసం... నీ పిల్లల కోసం... నీ భావి కోసం... నీ ఆనందం కోసం... రాయి... బాగా రాయి... మునుపటి కంటే బాగారాయి...

ఆ రాసింది... ఏ కవితా సంపుటిగానో ఏ పత్రికా ప్రచురణగానో నా కళ్ళలోపడి అది కన్నీటి చుక్కగా మారి... ఆ కన్నీటిబొట్లు మరలా ఓసారి నీకు పునరంకితం కావొద్దూ!

మనీషా!

నువ్వు కాలేజీ ఫంక్షన్‌లో "ఓ బాటసారీ నను మరవకోయీ" అంటూ భానుమతిని ఇమిటేట్ చేస్తూ పాడిన పాటని అభినందించడానికి స్టేజ్ మీదకి వచ్చాను. గుర్తుందా? బహుశా! అదే మన తొలి పరిచయం.

ఆనాటి ఫోటోలు నీ దగ్గర పదిలమే కదూ!

వద్దు... నీ దగ్గర అవి వద్దు... ఏమైనా ఉంటే 'కట్ట'కట్టి నాకు పంపించేసెయ్... వాటిని చూస్తూ నీ కోసం... నీ బదులూ నా బదులూ నేనే దుఃఖించిపారేస్తాను... ప్రస్తుతం కన్నీరేనా ప్రపంచం.

కష్టాలేనా నేస్తాలు...

అయినా ఏం? అవి నీ గురించిగా... అందుకని వాటి పేర్లు మార్చేసుకుని వాటికి నా సొంత పేర్లు పెట్టుకుంటున్నాను... మనీషా డియర్! మనం మనిష్టంగా ప్రేమించుకున్నాం. ఇప్పుడు నీ ఇష్టంగా పెళ్ళిచేసుకుంటున్నావ్!

జీవితంలో పెళ్ళయినా ప్రేమయినా ఒక్కొక్కసారే సంభవించే పవర్‌ఫుల్ సంఘటనలు... ఆ రెండూ ఒక్కరితోనే కావాలని 'విధాత రూల్స్'లో ఎక్కడా లేదేమో? అయితే అవనీ... మనం కూడా చరిత్ర పురుషులం అవుతున్నందుకు గర్వంగా ఉంది. మనీషా! నీకు రక్తమంటే భయం నాకు తెలుసు.

ఈ ఉత్తరంలో ఒక్క వాక్యం మాత్రం రక్తంతో రాస్తున్నాను. అనుమతించు...... జోగేశ్వరీ కుటుంబరావూ వాళ్ళిద్దర్లూ ప్రేమించుకుని వేరే వేరే పెళ్ళిళ్ళు చేసుకున్నప్పుడు "ఏమిటీ మనుషులు. వీళ్ళకి ప్రేమంటే తెలీదా?" అని అన్నావు... నేను నవ్వాను.

మనం మాత్రం అలా కాకూడదు అన్నావు.

లక్ష్మణరావూ అప్పలనర్సూ పెళ్ళి చేసుకుని ఆ తర్వాత డైవోర్సు తీసుకున్నప్పుడు నువ్వొకరోజు అన్నం మానేశావు.

ఇప్పుడు మనిద్దరం పెళ్ళికాకుండానే విడిపోతున్నాం.

ఇప్పుడు మనిద్దరిలో ఎవరో ఎన్నాళ్ళు అన్నం-మానెయ్యాలి?

మనీషా! నాకు 'ప్రేమ' నేర్పింది నువ్వే...

నువ్వు నేర్పిన ప్రేమ 'ప్రేమ'కన్నా గొప్పది. అందుకే నిన్ను ద్వేషించలేకపోతున్నాను.

నువ్వు మరొకరి ఇంటి ఇల్లాలివవుతున్న శుభసందర్భంలో ఇదే కవర్లో చిన్న అక్షింతల పొట్లం పంపిస్తున్నాను. ఇవి ఆ అక్షింతల పళ్ళెంలో కలుపు... ఒకవేళ ఆ సమయంలో నీ సమక్షం నాది కాకపోయినా నేనూ ఉన్నట్టు అవుతుంది... మనీషా!

నా కన్నీరు ఆవిరై ఆ ఆవిరి మేఘమై ఆ మేఘానికి నోరొచ్చి నీకు రహస్యంగా ప్రతిరోజూ నా కబురందిస్తే మనది మరో మేఘసందేశ కావ్యమౌతుంది. కానీ అలా అయ్యే అవకాశం లేదు.

అందుకని మనీషా! నీ ఇష్టం ఎప్పుడైనాసరే... మనుషులెవ్వరూ మసలని ఆఖరికి దేవుడికిక్కూడా దొరకని ఓ గొప్ప ఏకాంత ప్రదేశాన్ని కనుక్కో... అక్కణ్ణుంచి గట్టిగా పిలు... నా పేరు పెట్టి కొండలూ కోనలూ దిక్కులూ ఆకాశం... పాతాళం... సర్వ ప్రకృతి అదిరిపోయేలా గొంతంతా పెట్టి... గొంతులోంచి మంటలూ అగ్నిజ్వాలలూ వచ్చేలా పిలువ్... ఆ పిలుపే గెలుపై మరో జన్మకైనా మన చేతుల సంకెళ్ళలా బిగుస్తుందేమో!

మన మనస్సు ప్రేమకు తెలుస్తుందేమో!! మనం ప్రేమై, మనమే ప్రేమై, ప్రేమే మనమై ప్రేమ సామ్రాజ్యానికి మనమే అధినాథులం కావాలి'

అది జవాబో, కలయికో... పిలుపో గెలుపో ఏదైతేనేం? ఏదైన నా కలకోసం కనులు పెంచి ఎదురుచూస్తూ...

"నీ హృదయ శకలం"

◆



## ఫిల్మ్ పత్రిక పెడ్తున్న 'సన్నీ'

సినిమా పత్రికలకు దూరంగా వుండే 'సన్నీడియోల్' ఇప్పుడు సొంతంగా ఒక పత్రికను పెట్టబోతున్నాడట. అతను ప్రారంభించిన రికార్డింగ్, డబ్బింగ్ థియేటర్ బ్రహ్మాండంగా సాగుతోంది. నిర్మాతగా కూడా విజయాన్ని సాధించాడు. అతని కుటుంబంలోని వ్యక్తులు త్వరలో ఒక ఆడియో కేసెట్ కంపెని ప్రారంభిస్తున్నారట. పత్రికలలో రాసే గాసిప్స్‌ని అసహ్యించుకునే 'సన్నీ' తన పత్రికలో గాసిప్స్ లేకుండా జాగ్రత్త పడతాడనుకుంటా!